## అందుబాటులోకి స్విమ్మింగ్‌పూల్



స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలిస్తున్న డీసీ మారుతీదివాకర్

అంబర్‌పేట, ఏప్రిల్ 4 : అంబర్‌పేట మున్సిపల్ మైదానంలోని స్విమ్మింగ్‌పూల్‌ను ఈ నెల 6వ తేదీ శనివారం నుంచి అందుబాటులోకి తెస్తున్నట్లు అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ గేమ్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డితో కలిసి డీసీ స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. వేసవిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



## ఇఫ్తార్ విందు

ముషీరాబాద్, ఏప్రిల్ 4 : రాంనగర్ డివిజన్ బందన్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, కార్మిక నేత వి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మైనారిటీ నేత వాహిద్‌అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, సలీం, నేత శ్రీనివాస్, సత్యనారాయణ, సిద్ధిఖీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

# గ్యారంటీల గారడితో మోసం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 4 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటారని బీఆర్‌ఎస్ ఉప్పుగూడ డివిజన్ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సాప కృష్ణ, సాయిలు, మల్లేశ్‌యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ..గ్యారంటీల గారడితో తెలంగాణ ప్రజలకు మయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలకు కాంగ్రెస్ నిజస్వరూపం తెలిసిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసం పోయామని ప్రజలు గ్రహించి, ఆపార్టీని ఎవరూ నమ్ముతలేరని తెలిపారు. తప్పకుండా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు




## బెస్ట్ బిల్ కలెక్టర్ వేణు

అంబర్‌పేట, ఏప్రిల్ 4 : ఆర్థిక సంవత్సరం(2023-24)లో అంబర్‌పేట సర్కిల్‌లో టార్గెట్‌ను మించి అధికారులు ఆస్తిపన్ను వసూలు చేశారు. డీసీ మారుతీ దివాకర్ నేతృత్వంలో టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు యాక్టివ్‌గా పని చేసి పన్ను టార్గెట్‌ను మించి వసూలు చేసి రికార్డు బ్రేక్ చేశారు. ఇందులో బిల్ కలెక్టర్ వేణు కీలక పాత్ర వహించారు. దీనికిగానూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ వేణుకు బెస్ట్ బిల్‌కలెక్టర్ అవార్డును అందజేశారు. అలాగే డీసీతో పాటు మిగతా బిల్‌కలెక్టర్లను, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లును కూడా అభినందించారు.

## పీఆర్‌సీఐ వ్యవస్థాపక దినోత్సవం

అబిడ్స్, ఏప్రిల్ 4 : పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాలను గురవారం నిర్వహించారు. హోటల్ ది ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన బ్రాండ్‌లైఫ్ పీఆర్ న్యూ ఏజ్ స్టార్టప్ ప్రత్యేక గుర్తింపు పొందగా హరిప్రసాద్ గోగికర్, సుప్రీత్ పత్తిపాటి స్థాపించిన బ్రాండ్‌లైఫ్ పీఆర్ ప్రత్యేక విభాగంలో ఉత్తమ పీఆర్ స్టార్టప్‌గా అవార్డు సాధించగా బ్రాండ్ లైఫ్ పీఆర్ వ్యవస్థాపకులకు ఈ అవార్డును పీఆర్‌సీఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ షకీల్ అహ్మద్ అందజేశారు






## గురుద్వారాలో ప్రార్థనలు

గౌలిగూడలోని సెంట్రల్ గురుద్వారాలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్‌కు ఆశీర్వచనం చేశారు.
-అబిడ్స్, ఏప్రిల్ 4

## ఆధ్యాత్మిక చింతనతో భక్తి భావం పెంపొందించుకోవాలి

కాచిగూడ, ఏప్రిల్ 4: ఆధ్యాత్మికత చింతనతో భక్తి భావం పెంపొందించుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. లింగంపల్లి ఉత్తరాధిమఠంలో శ్రీనివాసదేవర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వేద పండితులతో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, పండితులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



విద్యార్థులకు ప్రశాంస పత్రాలను అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి

కాచిగూడ,ఏప్రిల్ 4: విద్యార్థులు తన కుంటుంబం కోసమే కాకుండా సమాజానికి సేవా చేయాల్సిన అవసరముందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. కాచిగూడ బద్రుక కళాశాల కామర్స్, ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మనోజ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబర్చిన బద్రుక కళాశాల విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అఫీసర్ ఈవీసీఎం శాస్త్రీ, డాక్టర్ కె. మమత, సుహాసిని, రాధ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేయకపోతే కేంద్రంపై పోరాటం



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

కాచిగూడ, ఏప్రిల్ 4: బీసీలకు సామాజిక న్యాయం చేయకపోతే కేంద్ర ప్రభుత్వంపై మిలిటెంట్ పోరాటం చేస్తామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు ఇస్తూ, 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించిన పార్టీలకే బీసీల పూర్తి మద్దతు ప్రకటిస్తామన్నారు. జాతీయ బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో పలు రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 10 సీట్లు కేటాయించి, బీసీ డిమాండ్లపై విధి, విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 56 కార్పొరేషన్లను కేటాయించాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 20 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భరత్‌సుందర్, నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, అంజి, సుధాకర్, రాజ్‌కుమార్, రాందేవ్‌మోడీ, వాణి పాల్గొన్నారు.



## గ్రాడ్యుయేషన్ డే

అంబర్‌పేట, ఏప్రిల్ 4 : బాగ్‌అంబర్‌పేట, డీడీ కాలనీలో గల నారాయణ స్కూల్‌లో ఈకిడ్స్, ఈ ఛాంప్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా యూకేజీ నుంచి ఒకటో తరగతికి వెళ్తున్న(ఈ కిడ్స్) విద్యార్థులు, ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి వెళ్తున్న(ఈ ఛాంప్స్) విద్యార్థులకు ముఖ్య అతిథిగా శ్రీవల్లి హాజరై పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ సవిత, కో-ఆర్డినేటర్లు లక్ష్మీభవాని, నూర్జహాన్, ఏవో మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ సుజాత, శిరీష, టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌కు జైలుశిక్ష..జరిమానా

కాచిగూడ,ఏప్రిల్ 4: ఆటోడ్రైవర్‌కు కోర్టు 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ కృష్ణానగర్‌కు చెందిన జె.అఖిలేశ్(24) ఆటోడ్రైవర్. 2018 సంవత్సరంలో కాచిగూడలో మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వెంటనే బాధితురాలు కాచిగూడ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అఖిలేశ్వర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం అఖిలేశ్వర్‌ను నాంపల్లిలోని పీఓసీఎస్‌ఓ హాకా భవన్ కోర్టులో హాజరుపరుచగా స్పెషల్ షెషన్ జడ్జి పుష్పలత అఖిలేశ్వర్‌కు 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు కాచిగూడ ఎస్సై సుభాష్ తెలిపారు.

## తాళ్లపాక పద సాహితికి వెంకట్ సేవలు అద్వితీయం

రవీంద్రభారతి,ఏప్రిల్ 4 : తాళ్లపాక పద సాహిత్యానికి వెంకట్ గరిపాటి చేస్తున్న సేవలు అద్వితీయమని స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ ప్రకాశ్ చంద్ర బరోడ్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త సుధామ మాట్లాడుతూ.. వెంకట్ గరిపాటి అన్నమయ్య అన్న పదానికి పర్యాయ పదంగా మారాడని అన్నారు. ఈ సందర్భంగా గరికపాటి 20వ పుస్తకం, చినతిరుమలయ్య సంకీర్తనలపై వ్యాఖ్యానం సమకూర్చబడిన 'చిన్మయ చింతనం' గ్రంథం ఆవిష్కరించబడింది. విఖ్యాత నేపథ్య గాయని, శాస్త్రీయ సంగీత గురువు తిరుమల శ్రీనిధి శిష్యబృందంతో అన్నమయ్య సప్తగిరి సంకీర్తనల శతగళార్చన గోష్ఠిగానం వ్యాఖ్యాన సహితంగా జరిగింది. శ్రీ రామ సాంస్కృతిక సంస్థ సారథి గొర్తి చంద్రశేఖర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.




చిన్మయ చింతనం పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రకాశ్‌చంద్ర బరోడ్, వెంకట్ గరికపాటి

## కాంగ్రెస్‌లో చేరిన బొట్టు రామ్



అబిడ్స్, ఏప్రిల్ 4 : జూబ్లీహిల్స్‌లోని రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసానికి శుక్రవారం ఉదయం జడ్చర్ల శాసనసభ్యులు అనిరుధ్‌రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు సుదర్శన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, రవీంద్రభారతి మాజీ చైర్మన్ శివకుమార్, శాసన సభ్యులు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌ల ద్వారా బొట్టు రామ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బొట్టు రామ్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## మ్యూజికల్ జర్నీ హైదరాబాద్ టూ అమెరికా

రవీంద్రభారతి,ఏప్రిల్ 4 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రోత్సహంతో కాలిఫోర్నియా తెలుగు సంఘం వారి ఆహ్వానం మేరకు సత్యశ్రీనాథ్ థియేటర్ అండ్ మ్యూజికల్ జర్నీ హైదరాబాద్ టూ అమెరికాలోని కాలిఫోర్నియాలోని సాన్‌ఫ్రాన్సిస్కో లాస్ ఏంజిల్స్ లాంటి ప్రముఖ నగరాలలో సత్యశ్రీనాథ్ టీం ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు కాలిఫోర్నియా తెలుగు సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. సత్యశ్రీనాథ్‌తో పాటు రేఖ, నాగభాస్కర్, అజయ్‌బాబు, పుష్ప, రాఘవ,శివ, ప్రవీణ్ ,వీరమనోహర్ కావలి, ఆకాశవాణి ప్రభు, స్వాతి ఎంపికయ్యారు.

## మాదిగలను విస్మరిస్తున్న సీఎం రేవంత్

కవాడిగూడ, ఏప్రిల్ 4: వరంగల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీట్లు కేటాయించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు అన్నారు. మాదిగ జాతి చేసిన మేలు నాకులం కూడా చేయలేదని నాడు రేవంత్‌రెడ్డి ఓ సమావేశంలో పేర్కొన్నారని అన్నారు. సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, నగర ఉపాధ్యక్షుడు తోటపల్లి సాయినాథ్, యువజన అధ్యక్షుడు జయ రామరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

# షోషకాహారంతోనే జీవుల మనుగడ

సుల్తాన్‌బజార్,ఏప్రిల్ 4 షోషకాహారంతోనే జీవుల మనుగడ సాధ్యమని టీఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోషిలక్ష్మి అన్నారు. ఈ మేరకు గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో న్యూట్రీషన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ టు గర్ల్ స్టూడెంట్స్ లెక్చర్ సిరీస్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె చందాసి దాస్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్‌లతో కలిసి సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తినే ఆహారం కార్బోహైడ్రేట్‌లు ఖనిజ లవణాలు, కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు అన్ని సమపాలలో ఉండేవాటిని పౌష్టికాహారం అంటారని విద్యార్థులకు సూచించారు. కన్సల్టెంట్ న్యూట్రీషనిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చందాసి దాస్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, హాస్టల్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటరమణ, జువాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ మీనాక్షి, మహిళా బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొని మాట్లాడుతున్న టీఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోషి లక్ష్మి

# 94 మంది డ్రైవర్లకు కళ్లద్దాలు పంపిణీ

మెహిదీపట్నం ఏప్రిల్ 4 : రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన కంటి పరీక్షలలో 94 మంది డ్రైవర్లకు కంటి అద్దాలు అవసరం ఉన్నట్లుగా గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు రోటరీ క్లబ్ వారి సహకారంతో గురువారం వారందరికీ కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ కంట్రోల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు ఆర్. వెంకటేశ్వర్లు, ఎల్. సుబ్బరాయుడు, ఎన్.అశోక్ కుమార్‌లు, గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. అంజయ్య, ఆర్ఐ అడ్మిన్ రవికుమార్‌లతో కలిసి కంటి అద్దాలను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




డ్రైవర్లకు కళ్లద్దాలను అందజేస్తున్న సౌత్ వెస్ట్, నార్త్ ట్రాఫిక్ డీసీపీలు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు

## డా.వై.నాగేశ్వరరావుకు సంవాహన అవార్డు బహూకరణ

రవీంద్రభారతి/చాంద్రాయణగుట్ట ఏప్రిల్ 4 : పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) 20వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హోటల్ ప్లాజాలో నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్, జర్నలిజం రంగంలో అత్యుత్తమ నిపుణులైన 9మందికి రాష్ట్ర స్థాయి సంవాహన అవార్డులను (ఏపీ, తెలంగాణ కలిపి) ప్రదానం చేశారు. సంవాహన అవార్డు జర్నలిజం రంగంలో విశేషంగా కృషి చేసినందుకుగాను సీనియర్ జర్నలిస్టు వార్త బ్యూరో చీఫ్ డాక్టర్ వై. నాగేశ్వరరావుకు అందజేశారు. ఇండియన్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షుడు విరాహత్ అలీ, పీఆర్‌సీఐ ఎమ్మిరిటస్ చైర్మన్ జయరాం, తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ అనుపురెడ్డి, సీఆర్‌సీఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ షకిలా అహ్మద్ ఈ అవార్డును నాగేశ్వరావుకు అందించారు. అలాగే సాక్షి దినపత్రిక డైరెక్టర్ కేఆర్‌పీరెడ్డి, దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ సీహెచ్ రాకేశ్, ఎన్‌ఎండీసీ కార్పొరేట్ కమ్యూనికేషన్ జనరల్ మేనేజర్ జయప్రకాశ్, ఆర్కేస్వామి, అనురాధాకిశోర్, డి.హేమంత్ అగర్వాల్, పాజిల్‌హుస్సేన్ అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు.



అవార్డును బహూకరిస్తున్న అజయ్‌మిశ్రా, సీనియర్ జర్నలిస్టు విరాహత్‌అలీ

## పైప్‌లైన్ పనుల పరిశీలన

గోల్నాక, ఏప్రిల్ 4: అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

## బీజేపీలో చేరికలు

మెహిదీపట్నం ఏప్రిల్ 4 : కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో లంగర్‌హౌస్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, బాలప్రసాద్ తివారి, వినేష్‌సింగ్, నాగేంద్రప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గుడిమల్కాపూర్‌లో దొంగ అరెస్టు

కార్వాన్, ఏప్రిల్4 : దొంగతనానికి పాల్పడిన ఓ యువకుడిని గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ ఉయద్ కుమార్‌రెడ్డి గురువారం గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో కుల్సుంపురా ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ భైరి రాజులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుడిమల్కాపూర్‌లోని ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌లో మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి దుకాణం నం.9లో పూల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2న దుకాణంలో దొంగతనం జరిగినట్లు మరునాడు గుర్తించాడు. బీరువాతో పాటు లాకర్‌లో దాచిన రూ.7.90 లక్షలు కనిపించలేదు. దీంతో యజమాని గుడిమల్కాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు పూల మార్కెట్‌లోని దుకాణం నం. 92లో పని చేసే గజానంద్(24) అనే యువకుడు తరచూ దుకాణం నం. 9లోకి వచ్చేవాడని తెలిసింది. అంతేకాకుండా దొంగతనం జరిగినప్పటి నుంచి గజానంద్ కనిపించకుండా పోవడంతో పోలీసుల అనుమానం బలపడింది. వెంటనే గజానంద్ స్వస్థలమైనటువంటి నాందేడ్‌కు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు అతని నుంచి రూ.6.20 లక్షల నగదు ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్.ఐలు మహబూబ్ బాషా, రాజేందర్ సింగ్‌తో పాటు క్రైం టీం పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 4 : ఎండలు తీవ్రం కావడంతో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గడీఖాన బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. ప్రత్యూష అన్నారు. ఈ మేరకు గురువారం సుల్తాన్‌బజార్‌లోని గడీఖాన బస్తీ దవాఖాన ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను స్థానిక వ్యాపారులు, ప్రజలకు ఆమె అందజేశారు. స్టాఫ్ నర్సు అనిత, ఏఎన్ఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ సమావేశం

కవాడిగూడ, ఏప్రిల్ 4: ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమావేశం ఈ నెల 5న (శుక్రవారం) ఉదయం 10-30 గంటలకు ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ముషీరాబాద్ బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10-30 గంటలకు జరిగే బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమావేశానికి సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరవుతారని, నియోజక వర్గంలోని ఆరు డివిజన్‌ల బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు బూత్ లెవెల్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నూతన నియామకం

ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా అడిక్‌మెట్ డివిజన్‌కు చెందిన రొయ్యూరు శేషసాయి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా నియమించినందుకు మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌లకు కృతజ్ఞతలు చెప్పారు.

**బీజేపీ యువమోర్చా...**

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 4: బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా గౌలిపురకు చెందిన అల్లి శివచంద్రగిరిని ఆ పార్టీ నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రేటర్ ఓబీసీ మహిళ అధ్యక్షురాలిగా లక్ష్మి



కాచిగూడ,ఏప్రిల్ 4: గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ మహిళ అధ్యక్షురాలిగా బాలినేని లక్ష్మిని నియమిస్తూ గురువారం కాచిగూడ కార్యాలయంలో నియామక పత్రాన్ని జేసినట్లు జాతీయ ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్ పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి తెలిపారు.

## సెంట్రల్ జోన్ బీజేవైఎం కార్యదర్శిగా దేవర వంశీ

కార్వాన్, ఏప్రిల్4 : సెంట్రల్ జోన్ విభాగంలోని బీజేవైఎం కార్యదర్శిగా గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన దేవర వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ సెంట్రల్ జోన్ విభాగం అధ్యక్షుడు గౌతంరావు నుండి దేవర వంశీ నియామక పత్రం అందుకున్నారు.